# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్.. ఎన్డీఏ కూటమి పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన నరేంద్ర మోదీ ఈ రోజు రాత్రి 7 గంటల 15 నిమిషాలకు ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్ష జరిపారు.**
3. **తెలంగాణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో మరో 65 చికిత్సలను చేర్చామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**
4. **రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ సీహెచ్.రామోజీరావు అంత్యక్రియలు ఈరోజు హైదరాబాదులోని రామోజీ ఫిల్మ్ సిటీలో తెలంగాణ ప్రభుత్వ లాంఛనాలతో జరుగుతాయి.**
5. **తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఈ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది.**

==========================

కేంద్రంలో నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్-ఎన్డీఏ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. కూటమి పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ఈ రోజు రాత్రి ప్రమాణ స్వీకారం చేస్తారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు రాత్రి 7 గంటల 15 నిమిషాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. నరేంద్ర మోదీతో ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయిస్తారు. కాగా.. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయడం వరుసగా ఇది మూడవసారి. 2014, 2019 సంవత్సరాల్లో ఆయన ప్రధాన మంత్రిగా వ్యవహరించారు. జవహర్ లాల్ నెహ్రూ తరువాత మూడవ సారి దేశ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న తొలి వ్యక్తి నరేంద్ర మోదీ కావడం గమనార్హం. ప్రమాణ స్వీకారానికి పలు దేశాధినేతలు, రాష్ట్రాల గవర్నర్లు, ఎన్.డి.ఎ. పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ పరిసరాలలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. భద్రతా కారణాల రీత్యా ఢిల్లీని నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్ష జరిపారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో నిన్న జరిగిన ఈ సమీక్షలో ఆయన ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాణ స్వీకారానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ సహా పలువురు ప్రముఖులు హాజరవుతారని, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయంలో ప్రముఖుల విమానాలు, హెలికాప్టర్లకు పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని విమానయాన అధికారులకు సూచించారు.

---------------------------

తెలంగాణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో మరో 65 చికిత్సలను చేర్చామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. యాంజియోగ్రామ్, పార్కిన్‌సన్స్, వెన్నెముక తదితర ఖరీదైన చికిత్సలను జాబితాలో చేర్చామని, ప్రస్తుతం ఈ పథకం కింద అమలులో ఉన్న చికిత్సల ప్యాకేజీ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్త చికిత్సా విధానాల చేర్పు, ప్రస్తుతం ఉన్న ప్రొసీజర్స్ ప్యాకేజీల ధరల పెంపు అంశంపై ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి నిన్న హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఈ పథకం కింద రాష్ట్రంలో 2 కోట్ల 84 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, ఇటీవల పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచారు. అందుకు అవసరమైన 497 కోట్ల 29 లక్షల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది.

---------------------------

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ..సిడబ్ల్యుసి కోరింది. ఢిల్లీలో నిన్న జరిగిన సీడబ్ల్యూసీ సమావేశం ఈ మేరకు చేసిన ప్రతిపాదనపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని రాహుల్ గాంధీ చెప్పారని సమావేశానంతరం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ పాత్రికేయులకు తెలిపారు.

---------------------------

రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ సీహెచ్.రామోజీరావు అంత్యక్రియలు హైదరాబాదులోని రామోజీ ఫిల్మ్ సిటీలో తెలంగాణ ప్రభుత్వ లాంఛనాలతో ఈరోజు జరగనున్నాయి. ఆయన పార్థివదేహాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పిస్తున్నారు. రామోజీరావు మృతికి సంతాప సూచకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో నిన్న, ఈ రోజు సంతాప దినాలుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు రోజుల పాటు జాతీయ పతాకాన్ని అవనతం చేయాలని, అధికారికంగా ఎటువంటి వేడుకలు నిర్వహించరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఈరోజు నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. టీజీపీఎస్సీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. సుమారు 4 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ చట్టాలకు కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడంతో కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్‌లోని కడప నగరానికి చెందిన న్యాయవాది శిరిషారెడ్డి పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమలవుతాయని, ఇప్పటివరకు న్యాయం కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్న బాధితులకు ఇకపై త్వరగా న్యాయం జరుగుతుందని ఆమె ఆకాశవాణికి వివరిస్తూ..

...వాయిస్...40 సెకన్లు

---------------------------

ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె నిన్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన కల్యాణ్‌కు బహిరంగ లేఖ రాశారు. వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపిన షర్మిల.. ప్రత్యేక హోదాకు, అన్ని విభజన హామీలకు కట్టుబడితేనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, యువతకు ఉద్యోగాలు, సంక్షేమం, అభివృద్ధి సమంగా సాగాలని ఆమె ఆకాంక్షించారు. జనం గొంతుగా మారిన కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, ప్రభుత్వ నిర్లక్ష్యాలను ప్రశ్నిస్తుందని షర్మిల స్పష్టంచేశారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి గత నెల 26వ తేదీన నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు ఈ రోజు ఉదయం వెలువడనున్నాయి. పరీక్ష నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఐఐటీ మద్రాస్ ఉదయం 10 గంటలకు ఈ ఫలితాలను విడుదల చేయనుంది. ఈసారి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ..జోసా కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యాసంస్థలు 114 నుంచి 121కి పెరిగాయి. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో బీటెక్, బ్యాచులర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీకి జోసా పేరిట సంయుక్త కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ రేపటి నుంచి జూలై 23వ తేదీ వరకు 44 రోజులపాటు కొనసాగుతుంది.

---------------------------

నైరుతి రుతుపవనాలు దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాలో కొన్ని ప్రాంతాలకు, ఉత్తరాంధ్రలో కొద్దిభాగం వరకూ విస్తరించాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, తూర్పు-పడమరగా విస్తరించిన ద్రోణి దక్షిణ కోస్తా మీదుగా పయనిస్తోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు ప్రాంతాల్లో నిన్న వర్షాలు కురిశాయి. రాబోయే 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తాలో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయని, చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. అటు.. తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి న్యాయ ప్రవేశ పరీక్ష - ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్- 2024 పరీక్షలను ఈరోజు మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తారు.

=====================